క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు


తమ్మరాజుపల్లెలో అవగాహన ర్యాలీ

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన, మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ–2 సుబ్రమణ్యం కోరారు. మంగళవారం పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో 'నేను బడికి పోతా'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, విద్యాసామగ్రి అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజనం ఉంటుందని వివరించారు.

జీపీఏటీ ఫలితాల్లో ప్రతిభ


తరుణ్‌కుమార్

పాణ్యం: ఎం.ఫార్మసీ(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీపీఏటీ) ఫలితాల్లో శాంతిరామ్ ఫార్మసీ కళాశాల విద్యార్థి తరుణ్‌కుమార్ 20వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చాటడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థిని అభినందించారు.


కల్లూరు వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్) : కల్లూరు వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పాణ్యం అర్బన్ పరిధిలోని 16 వార్డులకు సంబంధించి మున్సిపల్ అధికారులు, ఇంజినీర్లతో మాట్లాడారు. కల్లూరు వార్డుల్లో తాగునీటికి సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఉల్చాల రోడ్డులోని రాఘవేంద్రనగర్‌లో 6 రోజులుగా మంచినీటి సరఫరా లేదని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. తాగునీటి వేళలు సైతం ప్రజలకు పూర్తిగా ఇబ్బందిగా ఉందన్నారు. వేళలను మార్చడంతో పాటు రెండు రోజులకు ఒకసారి వచ్చే మున్సిపల్ వాటర్‌ను కనీసం గంట పాటు వదలాలని సూచించారు. కల్లూరు శివారు కాలనీల్లో రోడ్లు, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈలు షాకీర్ హుస్సేన్, ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: కడుపునొప్పి తాళలేక కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన రంజాన్ అనే వ్యక్తి మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి ఉండేదని, చికిత్స పొందినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రంజాన్‌ను బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రంజాన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రెవెన్యూ అంశాలపై అవగాహన


డీఆర్వోతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జీలు

కర్నూలు(సెంట్రల్): జూనియర్ సివిల్ జడ్జీలుగా ఎంపికైన లీల సాయిసుభాష్, పీజే తేజ, ఎ. వెంకటసాయి, ఎం.ఈశ్వర్ వెంకట ప్రసాదు, కట్ట హేమలకు రెవెన్యూ చట్టాలు, అంశాలపై డీఆర్వో కె.మధుసూదన్‌రావు మంగళవారం అవగాహన కల్పించారు.మొదటగా వారు డీఆర్వోను ఆయన చాంబరులో కలిశారు. అనంతరం గోకులం సమావేశ భవనంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు రోజంతా రెవెన్యూలోని అడంగల్, సర్వే నంబర్లు, 1బీ, ఇతర అంశాలై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎం. శేషిరెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమస్యలపై వినతి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల, ఇన్‌చార్జ్/అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులను 19 సంవత్సరాల అనుభవం ఉన్న సీనియర్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఎంఐసీ/అసిస్టెంట్ ఇంజినీర్‌లకు పోస్టులు ఇవ్వాలని కోరారు.

ఆటాపాట.. భవిష్యత్తుకు బాట!

చదువు.. మార్కులు...ర్యాంకులు..

పిల్లల ఎడ్యుకేషన్‌పై ఒకప్పుడు తల్లిదండ్రుల ఆలోచన. ఇప్పుడు వారి ఆలోచన విధానంలో మార్పు వచ్చింది. ఈ పోటీప్రపంచంలో చదువే భవిష్యత్ కాదని బాగా ఆడి పాడితే కూడా కెరీర్ ఉంటుందని తెలుసుకుంటున్నారు. తమ పిల్లలకు ఇష్టమైన రంగాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఆ దిశగా తమ పిల్లలకు అవసరమైన ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు.

– కర్నూలు కల్చరల్


వయొలిన్ నేర్చుకుంటున్న అభ్యాసకులు


నృత్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- పిల్లల కెరీర్‌పై తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మార్పు
- చదువుతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యం
- ఇష్టమైన రంగంలో పాల్గొనేలా ప్రోత్సాహం
- ఇతర విద్యార్థులతో పోలిస్తే క్రీడాకారుల జీవితాల్లో సక్సెస్ రేట్ ఎక్కువ
- ఆటలతో ఆరోగ్యంతో పాటు పెరగనున్న కమ్యూనికేషన్ స్కిల్స్

జీవితంలో చదువు ఒక భాగం. అక్షర జ్ఞానం, విషయవగాహనకు ఇది అవసరం. కొందరు చదువు ద్వారానే ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడతారు. మరికొందరు క్రీడాకారులుగా, డ్యాన్సర్లుగా, మ్యుజిషియన్లుగా, ఆర్టిస్టులుగా ఇష్టమైన రంగంలో స్థిరపడి లైఫ్‌ను లీడ్ చేస్తున్నారు. సహ పాఠ్యాంశాల్లో పాల్గొనే విద్యార్థులు మిగతా విద్యార్థుల కన్నా భిన్నంగా ఉంటారు. పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించడం.. ఒత్తిడిని జయించడంతో తమ గెలుపునకు ఉజ్వల బాటలు వేసుకుంటున్నారు.

చదువుతో పాటు.. ఇష్టమైన రంగాలు..

విద్యార్థి దశ నుంచే పిల్లలకు చదువుతో పాటు క్రికెట్, టెన్నిస్, స్విమ్మింగ్, షూటింగ్, బాడ్మింటన్, హాకీ, వాలీబాల్, హ్యాండ్ బాల్ లాంటి స్పోర్ట్స్‌తో పాటు డ్యాన్స్, సంగీతం, మృదంగం, నాదస్వరం, వయొలిన్, హార్మోనియం, లాంటి అంశాల్లో ఇష్టమైన ఏదో ఒకటి తప్పనిసరిగా నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల, కళాశాల చదువుతో పాటు వీటికి సమయాన్ని కేటాయించుకునే ప్లాన్ చేస్తున్నారు. లేదంటే ఇదివరకు పాఠశాలల నుంచి ఇంటికి వస్తేనే టీవీలకు హత్తుకుపోవడమో. సెల్‌ఫోన్ చేతపట్టుకోవడం చేసేవారు.

ఆటలతో ఆరోగ్యం.. ఆనందం..

ప్రస్తుత జీవన విధానంలో వచ్చిన మార్పులతో చదువుతో పాటు స్పోర్ట్స్, డ్యాన్స్, సంగీతం లాంటి వాటిని కెరీర్‌గా తీసుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. మరికొందరు ఏకంగా స్పోర్ట్స్‌ను కెరీర్‌గా తీసుకుని, చదువుకు ఆ తర్వాతి స్థానం ఇస్తున్నారంటే ఆటలపై ఏస్థాయి మక్కువ ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యా సంస్థలు పెరిగినట్లే స్పోర్ట్స్ అకాడమీలు, డ్యాన్స్ అకాడమీలు, మ్యూజిక్ ఇనిస్టిట్యూషన్ల సంఖ్య పెరుగుతోంది. క్రీడలు, డ్యాన్స్, సంగీతం లాంటి వాటిల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. ఇతర అంశాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉంటాయి. వీరిలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటాయి. డైట్ కంట్రోల్ ఉంటుంది. సహ పాఠ్యాంశాల్లో శిక్షణ పొందిన వారు ఇతర విద్యార్థుల కంటే జీవితంలో సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్నట్లు అధ్యయన సంస్థలు సైతం పేర్కొంటున్నాయి.

క్రీడల్లో ప్రతిభావంతులకు ప్రత్యేక కోటా

క్రీడల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి ప్రభుత్వం ఉన్నతాధికారులుగా పోస్టింగ్ ఇచ్చి గౌరవిస్తుంది. స్పోర్ట్స్‌లో సత్తాచాటి సర్టిఫికెట్ సాధిస్తే ఎంబీబీఎస్, ఇంజినీరింగ్‌తో పాటు అన్ని ప్రొఫెషనల్ కోర్సుల అడ్మిషన్లలో 0.5 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ ఉంటుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిట్ సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ మూడేళ్లు, ఉద్యోగానికి రిజర్వేషన్ ఏడు సంవత్సరాల వరకు వర్తిస్తుంది.

ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి



తల్లిదండ్రులుగా పిల్లలకు ఇష్టమైన వాటిలో ప్రోత్సహించాలి. మా అమ్మాయి ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఆమెకు స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం 7వ తరగతి నుంచి స్విమ్మింగ్‌కు రెగ్యులర్‌గా పంపుతున్నాం. స్విమ్మింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన ఈత పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుంది. చదువులో కూడా రాణిస్తుంది.

– పి.మాధవి, పేరెంట్

క్రీడలంటే చాలా ఇష్టం



నేను మాంటిస్సోరి పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నాకు చదువుతో పాటు క్రీడలు చాలా ఇష్టం. తైక్వాండోలో శిక్షణ పొందుతున్నాను. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. మా తల్లిదండ్రులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల యాజమాన్య సహకారం కూడా లభిస్తుంది. తైక్వాండోలో జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది. – ఎం. హిమనవ్య, విద్యార్థిని

రోప్‌స్కిప్పింగ్‌లో రాణించాలన్నది ధ్యేయం



నేను క్రెడో స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాను. నాకు ఆటలంటే చాలా ఇష్టం. రోప్‌స్కిప్పింగ్‌లో జాతీయ స్థాయిలో రాణించాలనేది నా ధ్యేయం. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి మెడల్స్ సాధించాను. ఇప్పటికే సౌత్ ఇండియా రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించాను. మా అమ్మనాన్న లక్ష్మి, జనార్దనుడు తీసుకుంటున్న శ్రద్ధ, పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం ఎంతో ఉంది. – ఎస్.యోగేశ్వరి, విద్యార్థిని

చదువుతో పాటు సంగీతం నేర్చుకుంటున్నా



నేను జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుచున్నాను. అమ్మ నాన్న ఉషారాణి, బసయ్య. నాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. నా ఇష్టాన్ని గుర్తించిన మా తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో సంగీతం నేర్చుకుంటున్నాను. నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు పూర్తి అయింది. తరువాత రెండు ఏళ్ల డిప్లమా కోర్సు పూర్తి చేయాలనుకుంటున్నాను. సంగీతం నేర్చుకోవడంతో నా చదువుకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. –కె. నమిత, బీటెక్ విద్యార్థిని

ఒత్తిడి దూరం



నేను విశ్వ భారతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. చదువుతో పాటు నాకు కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం. మా అమ్మ నాన్న జ్యోతి, సుబ్బయ్య ప్రోత్సాహంతో 2009 నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో రెండేళ్ల డిప్లామా కోర్సు చేస్తున్నాను. చదువుతో ఒత్తిడికి గురవుతుంటాం. నృత్య సాధన చేస్తే అన్నీ మర్చిపోయి ప్రశాంతత పొందుతాం.

– బి.కృష్ణ దీపిక, ఎంబీబీఎస్ విద్యార్థిని

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి


పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈఓఆర్డీ సందీప్ పంచాయతీ అధికారులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కంబదహాల్, సి.బెళగల్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. వారంలో ముడురోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. అదే విధంగా పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన తాగునీరు, పరిసరాల శుభ్రతతో రోగాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని సూచించారు.

మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి మృతి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోట్ల హర్ష, మణిగాంధీ, ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వర్‌రెడ్డి(55) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరసా ఇచ్చారు. ఈశ్వర్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఈశ్వరరెడ్డి మృతి తీరనిలోటు

ఈశ్వర్‌రెడ్డి మృతి పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. 20 ఏళ్లుగా వర్కూరు గ్రామాభివృద్ధికి, గ్రామస్తులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడ్డారని కొనియాడారు. వారి వెంట మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.


ఈశ్వర్‌రెడ్డి (ఫైల్)

ట్రైకో డెర్మా విరిడితో తెగుళ్ల నివారణ


ట్రైకో డెర్మా విరిడి తయారీని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాణ్యం: పంటలలో తెగుళ్ల నివారణకు ట్రైకో డెర్మా విరిడి బాగా పనిచేస్తుందని నంద్యాల ఏడీఏ సరళమ్మ అన్నారు. మంగళవారం పాణ్యం మండలం బలపనూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ట్రైకో డెర్మా విరిడి జీవ సీలింద్ర నాసిని అని పేర్కొన్నారు. 100 కిలోల పశువుల ఎరువుతో 10కిలోల వేపపిండి, 3 కిలోల ట్రైకో డెర్మా విరిడి, ఒక కేజీ కరిగించిన బెల్లం నీరుతో మిశ్రమాన్ని తయారు చేసి చూపించారు. ఈ మిశ్రమం పైరుకు, తెగుళ్ల నివారణకు, భూమిలోని శిలింద్రాలను సమర్థవంతంగా అరికడుతుందని తెలిపారు. వాటి వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, రామక్రిష్ణ, సతీష్‌బాబు, సరళమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, శశికల, ఏఓ జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించండి

- హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి


ఉప్పలపాడులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

ఓర్వకల్లు: మండలంలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఆగిపోయిన గృహ నిర్మాణ పనులను ప్రారంభించాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలపాడు, హుసేనాపురం గ్రామాల్లోని హౌసింగ్ కాలనీలను ఎంపీడీఓ మల్లీశ్వరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన నిర్మాణ పనులను మొదలుపెట్టుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఉప్పలపాడులో 80 శాతం, హుసేనాపురంలో 30 శాతం మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పూర్తిచేయని ఇళ్లకు బిల్లులు నిలిపివేస్తామన్నారు. ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన విద్యుత్, అంతర్గత రహదారులు, నీటి సదుపాయాలను సమకూర్చేలా ఆయా శాఖాధికారులతో చర్చించి, ప్రణాళికలు తయారు చేయాలని పేర్కొన్నారు. ఈ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరలో నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారులకు అవసరమైన నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఇళ్ల పురోగతికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ రామయ్య, ఏపీఓ కుమార్‌సాయినాథ్, టీఏలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన గురువారం జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

అక్రమ మద్యంపై నిరంతర నిఘా

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో కర్ణాటక మద్యం అక్రమ తరలింపుపై నిరంతర నిఘా ఉంటుందని సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మీడియాకు ప్రదర్శించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టి బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు మాదిగ మల్లేష్ కర్ణాటక నుంచి దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి మద్యం తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఏపీ 40 ఏహెచ్ 7544 నంబర్ గల యాక్సిస్ బైక్‌ను సీజ్ చేసి 5 బాక్సుల్లోని 480 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.55 వేలు ఉంటుందని చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నంబర్ 94409 02579 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో సెబ్ సీఐ భార్గవ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్ పాల్గొన్నారు.

నేడు ఏపీ హంస సిటీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ హంస సంఘం సిటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీన సాయంత్రం 3 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నగర అధ్యక్షుడు టి. గోవిందు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఆరవ పాల్ హాజరవుతారన్నారు. సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సంఘం నాయకులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజుకు ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం ఆసుపత్రి తనిఖీకి వచ్చిన ఆయనను యూనియన్ నాయకులు కలిసి వారి సమస్యలు విన్నవించారు. ఆసుపత్రిలో ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓలు, పారా మెడికల్ సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉందని చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు నాయక్, రాష్ట్ర కార్యదర్శి అబ్రహాం, కర్నూలు శాఖ కార్యదర్శి ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, నాయకులు హరిశ్చంద్ర నాయుడు, శేషిరెడ్డి, సుందర్‌రాజు తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లు, పనుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వస్తుందని తెలిపారు. కూలీలంతా పనివేళలు పాటించడంతో పాటు పనుల్లో నాణ్యత ఉండేలా చేయాలని సూచించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి పథకం కింద పనులు కల్పిస్తామన్నారు. ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకం చేపట్టేలా చిన్న, సన్న కారు రైతులను ప్రోత్సహించాలని, ఈ ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోడుమూరు ఏపీఓ మోదీన్‌బాషా, సిబ్బందిని ఆదేశించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


తిరుపాడు గ్రామంలో సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గడివేముల: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ శివరామకృష్ణ, ఎస్ఆర్ఎఫ్ హర్షవర్ధన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో సాగు చేసిన పత్తి, మినుము మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలను వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పత్తి పంటలో పచ్చ దోమ గమనించామని తెలిపారు. అదే విధంగా సోయాబీన్, మినుము పంటలో ఆకు తొలుచు పురుగు గుర్తించామని.. వీటి నివారణకు వేప నూనె 5 మి.లీ ఒక లీటరు నీటికి, వర్షాభావ పరిస్థితుల వల్ల పెట్టను అధిగమించడానికి 10 శాతం యూరియాను పిచికారీ చేయాలని సూచించారు. పీఎం కిసాన్, కౌలు కార్డులు, ఆర్‌బీకే నుంచి కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ఎంతో ముఖ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

గడివేముల: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కరిమద్దెల జెడ్పీస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కరిమద్దెల జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి బేటీ బచావో బేటీ పడావో, యోగా, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఆడపిల్లల చదువు దేశానికి ఎంతో అవసరమన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని.. తల్లిదండ్రులు అమ్మాయిలను చదివించాలని కోరారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్, పరిమళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, కార్యకర్తలు రుక్మిణి, వెంకటేశ్వరమ్మ, సావిత్రి, వరలక్ష్మీ, వసంతలక్ష్మీ, చంద్రావతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ఎరువులను విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఓర్వకల్లు: అనుమతి లేని ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా గన్నవరం ఏడీఏ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సోమయాజులపల్లె, హుసేనాపురం, ఓర్వకల్లు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. రసాయన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు. ఓర్వకల్లులోని కిసాన్ అగ్రిమాల్ దుకాణంలో రూ.37,050 విలువైన బయోపెస్టిసైడ్ క్రిమిసంహారక మందులకు సరైన రికార్డులు చూపకపోవడంతో స్టాక్‌ను నిలిపివేశారు. రికార్డులు సరిగాలేని ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రశీదులను పొందాలన్నారు. అన్ని దుకాణాల్లో ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు, ధరల పట్టికను నోటీస్ బోర్డుల్లో ఉంచాలని ఆదేశించారు. ఏడీఏ హనుమంతరావు, విజిలెన్స్ డీఎస్పీలు చంద్రశేఖర్, కేశవరెడ్డి, సీఐ రామకృష్ణ, స్థానిక ఏఓ సుధాకర్, ఏఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.